

రూ.15లక్షలు స్వాహా

ములకలచెరువు రైతు ఉత్పత్తిదారుల సంఘం నిధులు రూ.15.76 లక్షలు స్వాహా చేసిన వ్యవహారం ఉన్నతాధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. -8లో



వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.440
రెండోరకం	రూ.230	రూ.310

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 201 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఐదు పోలీసు స్టేషన్ల అప్‌గ్రేడ్

బి.కొత్తకోట: జిల్లాలో ఐదు పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బి.కొత్తకోట, కోడూరు, మన్నూరు, కలికిరి, రాయచోటి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ అయ్యాయి. ప్రస్తుతం స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఎస్‌ఐలు విధులు నిర్వహిస్తుండగా, ఇకపై సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తారు. ఇకపై ఈ స్టేషన్లలో విధులు నిర్వహించే సీఐలకు సర్కిల్ ఉండదు.

నేడు బి.కొత్తకోటలో 'జగనన్నకు చెబుదాం'

బి.కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. కలెక్టర్ పీఎస్ గిరీషా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమం కోసం ఎంపీడీఓ శంకరయ్య ఏర్పాట్లు చేస్తున్నారు.

26న బ్యాడ్మింటన్ ఎంపికలు

రాజంపేట టౌన్: ఈనెల 26వ తేదీన రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ క్రీడ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆకేపాటి శంకర్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రావు, జిల్లా సెలక్షన్ కమిటీ కన్వీనర్ వై.నందకిషోర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అనంతపురంలో జరిగే పురుషుల, మహిళల సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఈ ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. సెలక్షన్ కోసం వచ్చే క్రీడాకారులు వైట్ అండ్ వైట్ దుస్తులు వేసుకొని రావాలన్నారు. అలాగే ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో సెలక్షన్ రోజున ఉదయం 9 గంటల నుంచి పది గంటల లోపు క్రీడా మైదానానికి చేరుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9398865739 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీకి పెరిగిన ఆదాయం




ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం రాము

పీలేరు రూరల్: జిల్లాలో ఆర్టీసీకి రూ.4 కోట్లు ఆదాయం పెరిగిందని ఆర్‌ఎం రాము అన్నారు. గురువారం ఆయన పీలేరు డిపోను, బస్టాండ్‌ను తనిఖీ చేశారు. అనంతరం డీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ వరకు రూ.170 కోట్లు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.174 కోట్లు వచ్చిందన్నారు. బస్సుల నిర్వహణలో మదనపల్లె 1 డిపో ప్రథమ, మదనపల్లె 2 డిపో ద్వితీయ, పీలేరు డిపో తృతీయ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. కాగా, కలకడ బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.8 లక్షలు మంజూరైనట్లు, పీలేరు బస్టాండ్ పైకప్పు మరమ్మతుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి వైఎస్సార్ జిల్లాకు చెందిన భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేటకు గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపాల్‌రెడ్డి, వీరమ్మల పేరిట నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, ఆలయ అధికారులు అందజేశారు.

ప్రమాణ స్వీకారం



బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కుప్పం ప్రసాదరావు

చక్రాయపేట: ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గురువారం కుప్పం ప్రసాదరావు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని గొల్లపూడిలో దేవదాయశాఖ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ కార్యాలయంలో చైర్మన్ కామేశ్వర రావు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ శ్రీనివాస్, జీఎం నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ప్రభంజనం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మురిసిన కడప నగరం
- నాయకులకు అడుగడుగునా అపూర్వ స్వాగతం
- అలరించిన లంబాడీ నృత్యాలు, డప్పు వాయిద్యాలు



కడపలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడప నగరంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రభం'జనం' సృష్టించింది. గురువారం ఉదయం నుంచే కడపలో ఉత్సాహ పూరిత వాతావరణం నెలకొంది. జనం నీరాజనాలు పలికారు. బస్సు యాత్ర సాగే రోడ్డులో రవీంద్రనగర్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు కనువిందు చేశాయి. రోడ్ల వెంట కట్టిన వైఎస్సార్ సీపీ మూడు రంగుల జెండాలు రెపరెపలాడాయి. మధ్యాహ్నం 3.25 గంటలకు యూఎస్ మహల్ నుంచి బస్సు యాత్ర ర్యాలీ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ ర్యాలీ వెంట లంబాడీలు తమ నృత్యాలతో, డప్పు వాయిద్య కళాకారులు తమ విన్యాసాలతో, వైఎస్సార్‌సీపీ జెండాలతో గుర్రపు స్వారీ చేసేవారు అగ్రభాగాన కొనసాగారు. ర్యాలీ ప్రారంభంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఉన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, ఎంపీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జిల్లా కోశాధికారి హఫీజుల్లా, డాక్టర్ సొహైల్ తదితరులు ర్యాలీ వెంట నడిచారు. వారికి స్థానిక ప్రజలు, మహిళలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు.పూలు చల్లుతూ భారీ ఎత్తున బాణాసంచా పేల్చుతూ మంగళ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. యూఎస్ మహల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రవీంద్రనగర్, పాతబస్టాండు మీదుగా ఏడురోడ్ల కూడలికి చేరింది. భవనాలకు కట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పాత బస్టాండులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో నడుస్తున్న వైఎస్సార్ సీపీ నేతలను అభిమానులు పాత బస్టాండు, ఏడురోడ్ల కూడలిలో గజమాలలు తెచ్చి క్రేన్ల సాయంతో వారికి అలంకరించి ఘనంగా సత్కరించారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమైంది. అత్యధిక సంఖ్యలో మహిళలు, యువత ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అన్ని డివిజన్ల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. యూఎస్ మహల్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు మేధావులతో సమావేశం నిర్వహించారు. 1.30 గంటలకు అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. 2 గంటలకు ముఖ్యనేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. 3.25 గంటలకు సామాజిక సాధికార బస్సుయాత్ర ర్యాలీ ప్రారంభమైంది. 4.20 గంటలకు ఏడురోడ్ల కూడలిలో బహిరంగ సభ ప్రారంభమై 5.55 గంటలకు ముగిసింది. ఏర్పాట్లను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వారి సోదరుడు అహ్మద్‌బాషాలు చేశారు.



మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



అలరించిన లంబాడీల నృత్యాలు

మీ నమ్మకాన్ని వమ్ము చేయను...



కడప నియోజకవర్గ ప్రజలు నాపై ఉంచి నమ్మకాన్ని వమ్ము చేయను. కడపను ఆదర్శంగా తీర్చిదిద్దుతా. చంద్రబాబు నాలుగున్నరేళ్లలో మైనార్టీలను మంత్రివర్గంలోకి తీసుకోలేదు. మీరు రెండు పర్యాయాలు నన్ను అసెంబ్లీకి పంపితే, వైఎస్ జగన్ డిప్యూటీ సీఎం పదవి అప్పగించారు. కడపలో కోట్లాది రూపాయలతో అభివద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో కడపకు ఏం చేశారో చెప్పాలి.

– ఎస్‌బి అంజద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి

పేదల జీవితాలు మార్చడానికి యజ్ఞం



పేదల జీవితాలను సమూలంగా మార్చడానికి జగనన్న ఒక యజ్ఞం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చారు. కేబినేట్‌లో 70శాతం మంత్రి మంత్రులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారే ఉన్నారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినా, రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసినా బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజలు జగనన్నను ఆశీర్వదించాలి.

– వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎంపీ

వెనుకబడిన వర్గాల ఉన్నతికి కృషి



భారతదేశ చరిత్రలో బీసీలు ముఖ్యమంత్రులుగా పనిచేసిన ములాయంసింగ్, అఖిలేష్ యాదవ్, నితీష్‌కుమార్, స్టాలిన్‌ల సర్కార్‌లో కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇంతటి ప్రాధాన్యత దక్కలేదు. వెనుకబడిన వర్గాల ఉన్నతి కాంక్షించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే. కడప జిల్లాలో 2006 నుంచి ఇప్పటికీ నన్ను జిల్లా అధ్యక్షుడుగా నడిపించడమే అందుకు నిదర్శనం.

– కె.సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

మన తలరాతలు మారాలంటే జగన్ రావాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, చిత్రంలో మాజీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కడప కార్పొరేషన్ : మన తల రాతలు మారాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం కడపలోని యూఎస్ మహల్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్సీ కుంభా రవిబాబులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్నాయంటూనే అన్ని పార్టీలకు సామాజిక న్యాయం, సాధికారత గుర్తుకు వస్తాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రాజకీయంగా, సామాజికంగా ఏం లబ్ధి చేకూర్చారో చెప్పాలని నిలదీశారు. దీనిపై ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మీ కుటుంబాలకు మేలు జరిగి ఉంటేనే నాకు ఓటేయాలని అడిగే దమ్మున్న నేత ఒక్క వైఎస్ జగన్ మోహన్‌రెడ్డేనని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం వల్ల మన విద్యార్థులు ఐక్యరాజ్య సమితిలో మాట్లాడే అవకాశం లభించిందన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను జగనన్న ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారన్నారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి 76 సంవత్సరాలు పట్టిందని, కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరుపైనే ఇస్తూ ఆర్థిక సాధికారత దిశగా పయనింపజేస్తున్నారన్నారు.

- ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మార్కెట్‌యార్డు చైర్ పర్సన్ గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలు పేదల శ్రమను దోపిడీ చేశాయి

గతంలో పాలించిన అన్ని ప్రభుత్వాలు పేదలు, బడుగు, బలహీన వర్గాల శ్రమశక్తిని దోపిడీ చేశాయని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను ప్రథమ శ్రేణి పౌరులుగా తీర్చిదిద్దేందుకు వారిని సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థాయికి తెస్తున్నారన్నారు. తన మంత్రివర్గంలో 17 మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఉండడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది జెడ్పీ చైర్మన్లలో 12 మంది, మేయర్లలో 9 మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. అమరావతిలో 51 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారన్నారు.

పెద్దదర్గా ఉరుసుకు జోరుగా ఏర్పాట్లు



దర్గా వద్ద దుకాణాల ఏర్పాటు పనులు

కడప కల్చరల్: కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ఉరుసు ఉత్సవాలకోసం ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల సంప్రదాయంగా నషాన్ ఉత్సవాన్ని నిర్వహించి దర్గా ఉరుసు ఏర్పాట్లను ప్రారంభించారు. అందులో భాగంగా పది రోజులుగా ప్రాగణంలో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో ఎస్పీ శాంతిభద్రతల వ్యవహారాలను, మున్సిపల్ కమిషనర్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తున్నారు. దర్గా ప్రాంగణమంతా పార్కుల్లో లాగా సిమెంటు ఇటుకలు పరిచారు. జియారత్ హోటల్ ప్రాంగణంలో బయటి ప్రాంతాల నుంచి రానున్న భక్తుల కోసం భారీ పందిరి వేశారు. దర్గా పరిసరాల్లో దుకాణాల ఏర్పాటు కోసం పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. ఉరుసు సందర్భంగా పిల్లలు, యువకులు వినోదం కోసం జియారత్ హోటల్ సమీపంలో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు దర్గా ప్రాంగణంలో ఉరుసు ఉత్సవాల ఏర్పాట్ల గురించి దర్గాప్రతినిధులు మీడియాకు వివరించనున్నారు.

ఐఈఎస్‌కు ఎంపికైన రైతుబిడ్డ



మనోహర్‌రెడ్డి

పెద్దముడియం: వైఎస్సార్‌జిల్లా పెద్దముడియానికి చెందిన రైతు తుంగ రామసుబ్బారెడ్డి కుమారుడు తుంగా మనోహర్ రెడ్డి యూపీఎస్సీ నిర్వహించిన ఐఈఎస్(ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్)లో ఆలిండియా 5వ ర్యాంకు సాధించాడు. రామసుబ్బారెడ్డి తనకున్న 3 ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ గ్రామంలో చిన్న హోటల్ నడుపుకుంటూ కుమారుడిని చదివించారు. మనోహర్ రెడ్డి 1 నుంచి 5వ తరగతి వరకు జమ్మలమడుగులో, 5 నుంచి 10వ తరగతి వరకు ఆళ్లగడ్డలో, తిరుపతి ప్రభుత్వ కళాశాలలో పాలిటెక్నిక్ చదివాడు. తిరుపతి ఎస్.వి.సి.ఇ ఇంజినీరింగ్ కళాశాలలో 2019లో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం సంవత్సరం పాటు యూపీఎస్సీ పరీక్షలకు శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం నేషనల్ టాలెంట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన తాజాగా వెలువడిన ఐఈఎస్ ఫలితాల్లో 5వ ర్యాంకు సాధించారు. ఈయన విజయం పట్ల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి 'వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర'

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నారు. దీనిని విజయవంత చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణపై మండలస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రను అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందజేస్తున్న సహాయం, సంక్షేమ పథకాలు గురించి ప్రజలలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్, 36 శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామస్థాయిలో సర్పంచ్ అధ్యక్షుడుగా 1012 మంది అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రచార నిమిత్తం జిల్లాకు 4 వ్యాన్లు రానున్నాయన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24 నుంచి జనవరి 26వ తేది వరకు వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు జరగాలన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కలామ్స్ విజన్ 2023 లోగోను ఆవిష్కరణ

రాయచోటి టౌన్: రాయచోటిలో నేటినుంచి ఇంటర్నేషనల్ మెరిట్ హైస్కూల్లో కలామ్స్ విజన్–2023 సైంటిఫికల్ ప్రాజెక్టు ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. దీనిని విజయంతం చేయాలని జిల్లాకలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ రూపొందించిన కలామ్స్ విజన్ సైంటిఫికల్స్ ఎక్స్‌పో లోగోను ఆవిష్కరించారు. మ్యాజికల్ షో, అవగాహన సదస్సులు చూడడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రోగ్రాం డైరెక్టర్ తెలిపారు. అన్ని పాఠశాలల విద్యార్థులు వీక్షించవచ్చని తెలియజేశారు.

తోబుట్టువులకు కల్యాణమస్తు

జిల్లాలో 342 మందికి రూ.2.76 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి: ప్రభుత్వం పేద కుటుంబాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. పేద కుటుంబాల్లోని వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడానికి వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.అర్హులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకాల కింద జులై–సెప్టెంబర్, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 10,511 మందికి రూ.81.64 కోట్ల ఆర్థిక సాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు.అన్నమయ్య జిల్లాకు సంబంధించి 342 మంది జంటలకు రూ.2,76,05,000 లబ్ధి చేకూరింది. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ కలీం, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్‌హుస్సేన్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం అర్హులైన లబ్ధిదారులకు మెగా చెక్కును జిల్లా కలెక్టర్ అందజేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రభుత్వం నుంచి షాదీతోఫా సహాయం అందడం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబంలో అన్ని ప్రభుత్వ పథకాలతో పాటు అమ్మ ఒడి, మా అవ్వకు పెన్షన్, జగనన్న ఇళ్లు మంజూరైంది. ఇలాంటి మంచి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. సీఎం తోడుగా ఉంటాం

– ఎస్.ఫర్హానా, బోస్‌నగర్, రాయచోటి

జగనన్న ప్రభుత్వం పది కాలాల పాటు ఉండాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎప్పుడూ ఎవరూ చేయని విధంగా పలు పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారు. వైఎస్ఆర్ కల్యాణమస్తు పథకం మాకు ఎంతగానో ఉపయోగపడింది. మా బంధువులందరికీ అమ్మ ఒడి, జగనన్న ఇల్లు, అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇలాంటి ప్రభుత్వం పది కాలాల పాటు ఉండాలని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలి.

– డి.రెడ్డికుమారి, కెవి పల్లి మండలం, అన్నమయ్య జిల్లా

నూతన కమిటీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏపీ రైతు సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య తెలిపారు. కడపలోని ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి హాల్‌లో గురువారం ఆ సంఘం జిల్లా సమితి సమావేశం సందర్భంగా ఈ ఎంపిక జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.వి.సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోతిరెడ్డి భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడిగా చంద్ర, ఉపాధ్యక్షులుగా శంకర్ రెడ్డి, కట్టా యానాదయ్యలతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లె గ్రామానికి చెందిన స్వామికొండ అనే వ్యక్తిపై పూర్ణచంద్రనాయుడు అనే వ్యక్తి దాడి చేశాడు. బుధవారం రాత్రి కుటుంబ విషయాలపై మాటామాటా పెరిగి స్వామికొండపై దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం బాధితుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని పోతబోలు పంచాయతీ బూచేపల్లెకి చెందిన రాజశేఖర్ భార్య వందన (28) కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగింది. అదే విధంగా పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన శ్రీరాములు కుమారుడు గంగరాజు(30) కుటుంబ సమస్యల కారణంగా విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధింత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : వేర్వేరు చోట్ల జూదస్థావరాలపై జరిపిన దాడుల్లో 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం ఉదయం మండల పరిధిలోని రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లె వద్ద జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా ఎర్రాతివారిపల్లె సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3080 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

బైకును ఢీకొన్న లారీ



ప్రమాదంలో గాయపడిన వెంకటరెడ్డి

చిట్వేలి : మండల పరిధిలోని కంద్రావారిపల్లి వద్ద బైకును లారీ ఢీ కొన్న సంఘటనలో ఆకేపాటి వెంకటరెడ్డి (44) తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటల సమయంలో దొగ్గలపాడుకు చెందిన వెంకటరెడ్డి చిట్వేలికి వస్తుండగా అదే సమయంలో చిట్వేలి నుంచి దేవమాచుపల్లి వైపు వెళ్తున్న లారీ కంద్రావారిపల్లి వద్ద ఢీ కొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటరెడ్డికి ఎడమకాలు విరిగి, తలకు బలమైన గాయం తగలడంతో చికిత్స నిమిత్తం రాజంపేటకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ములకలచెరువు ఎఫ్‌పీఓలో రూ.15లక్షలు స్వాహా

- వసూలు చేసిన సొమ్ము సొంత జేబుల్లోకి
- గత ఫిబ్రవరిలోనే ఉన్నతాధికారుల విచారణ
- సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ



ములకలచెరువు ఎఫ్‌పీఓ కార్యాలయం

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో మహిళా సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు స్వాహా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ములకలచెరువు రైతు ఉత్పత్తిదారుల సంఘం నిధులను చేతికి దక్కింది దక్కినట్టుగా స్వాహా చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో జరిగిన లావాదేవిల్లో రూ.15.76 లక్షలు స్వాహా జరిగినట్టు ఉన్నతాధికారుల విచారణలో వెలుగు చూసింది. ఈ వ్యవహారంపై గత ఫిబ్రవరిలోనే సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ వివరాల్లోకి వెళితే..

ములకలచెరువు రైతు ఉత్పత్తిదారుల సంఘంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని కలెక్టర్‌కు ఓ ఫిర్యాదు అందింది. దీనిపై విచారణకు ఆదేశించగా డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఓ బృందం ద్వారా సమగ్ర విచారణ జరిపించారు. విచారణలో నలుగురు ఏపీఎంలు, ఇద్దరు సీసీలు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేల్చారు. డిసెంబర్ 31, 2022 వరకు ఆర్థిక లావాదేవిలపై జరిపిన విచారణలో సంఘం ద్వారా రైతులకు అవసరమైన పరికరాలు, యంత్రాలను విక్రయించినట్టు తేలింది. విత్తనాలు, తేనె, స్ప్రేయర్లు, గ్రోమోర్ ఫీడ్, వెయింగ్ మిషన్లు తదితర వాటిని రైతులకు విక్రయించిన సొమ్ము, సింజెంటా రుణాలకు సంబంధించిన నగదు లెక్కల్లో ఖాతాల్లో జమకాని సొమ్ము రూ.10,07,828 ఉన్నట్టు నిర్ధారించారు. ఇదికాక వసూలైన సొమ్ములో ఖాతాకు జమ చేయకుండా 8 మంది సిబ్బంది వద్ద ఉన్న నగదు, ఇతరుల వద్ద నగదు కలిపి రూ.5,68,657 ఉన్నట్టు తేల్చారు. మొత్తం రూ.15,76,485 సొమ్ము ఖాతాకు జమ కాకుండా స్వాహా అయిందని తేల్చారు.

ఏపీఎంల నిర్లక్ష్యంపై షోకాజ్

సంఘాల నిధులు ఇష్టారాజ్యంగా స్వాహా చేస్తూ దుర్వినియోగం అవుతుంటే కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు మొక్కుబడి చర్యలతో వదిలేస్తున్నారు. ములకలచెరువు ఎఫ్‌పీఓ వ్యవహారంపై 2018 ఆగస్టు 7 నుంచి ఇప్పటి వరకు పనిచేసిన ఒక ఎఫ్‌పీఓ సీసీ, ఒక ఎంఎస్‌సీసీ, ఇద్దరు ఎఫ్‌పీఓ ఏపీఎంలు, ఇద్దరు ఎంఎస్ ఏపీఎంలకు గత ఫిబ్రవరి 14న పీడీ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. పై అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే నిధులు దుర్వినియోగం అయినట్టు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. అయితే పర్యవేక్షణ అధికారుల ప్రమేయం లేకుండా నిధులు దుర్వినియోగం సాధ్యమవుతుందా అన్నది విచారణ అధికారులు గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అడ్వాన్సుల బాధ్యత ఎవరిది?

ఎఫ్‌పీఓ ఖాతా నుంచి నిధులను ఎవరు డ్రా చేస్తారు, ఆ నిధులను దేనికి ఎవరి ఆధ్వర్యంలో ఖర్చు చేస్తారు లేదా ఏదైనా కొనుగోలు చేస్తారు అన్నది విచారణలో అధికారులు పరిశీలించకపోవడం చూస్తే మొత్తం విచారణపైనే అనుమానాలు కలుగుతున్నాయి. విచారణలో గుర్తించినట్టు పర్యవేక్షణ అధికారుల ప్రమేయం లేకుండా రూ.4.57 లక్షలు ఖర్చుచేసి విత్తనకాయలను ఎవరు కొనుగోలు చేశారు? ఈ నిధులను వినియోగించి కొన్న విత్తనాలు విక్రయించాక వచ్చిన సొమ్ము ఖాతాకు ఎందుకు జమకాలేదు, ఈ విత్తనాల విక్రయ బాధ్యత ఎవరిది, నిధులు ఎందుకు మళ్లీ ఖాతాకు చేరలేదో పర్యవేక్షకులు ఎందుకు పట్టించుకోలేదు? రైతుల నుంచి వసూలైన నగదు బ్యాంకు ఖాతాకు జమ అవుతోందా లేదా అని పర్యవేక్షించాల్సిన సంబంధిత సీసీలు, ఏపీఎం రూ.5,68,657 నిధులు దుర్వినియోగమైనా విచారణ జరిగేదాక ఎందుకు పట్టించుకోలేదు?. వసూలైన నగదు బ్యాంకు ఖాతాలకు జమ చేయకున్నా నెలల తరబడి రహస్యంగా ఉంచిందెవరు?. ఈ వివరాలపై విచారణ జరిగితే అసలు సూత్రధారులు బయటికొస్తారు. ఇవికాకుండా యంత్ర పరికరాలు, స్ప్రేయర్లు కొన్నట్టు చెబుతున్నారు. ఇవి ఉన్నాయో లేవో అధికారులే చెప్పాలి.

చర్యలు తీసుకుంటాం

ములకలచెరువు ఎఫ్‌పీఓలో నిధుల స్వాహాపై విచారణ జరిపించి బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. కొందరు స్వాహాచేసిన సొమ్మును తిరిగి చెల్లిస్తామని బాండ్లు రాసిచ్చారు. ఆ మేరకు సొమ్ము వసూలు చేస్తున్నాం. సొమ్ము రాబట్టలేకపోతే చర్యలు తీసుకుంటాం.

- సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ, రాయచోటి

ఆర్టీసీ డ్రైవర్ హత్య కేసులో నిందితుల అరెస్టు



ఆర్టీసీ డ్రైవర్ హత్యకేసులో నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ రహీముల్లా

కలికిరి : మండలంలోని నల్లగుట్ట దళితవాడకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సాలి రవి(52) హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 13న డ్రైవర్ హత్యకు గురైన విషయం విదితమే. వాల్మీకిపురం సీఐ పి.సురేష్‌కుమార్, కలికిరి ఎస్ఐ కె.రహీముల్లా మీడియాకు వివరాలను వెల్లడించారు. మృతుడు రవి కుమారుడు హేమంత్, పీలేరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్న ఆనంద్ కుమార్తె ప్రేమించుకున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయల్‌పాడు సమీపంలో ఆనంద కుమార్తె అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తన కుమార్తె మృతికి హేమంత్ కారణమని ఆనంద్ కక్ష పెంచుకున్నాడు. హేమంత్ చింతామణి జైలులో ఉండటంతో అతని తండ్రిని అంతమొందించాలని రెక్కీ నిర్వహించాడు. ఇందుకు ఆనంద్ భార్య లక్ష్మీదేవి అలియాస్ లీలావతి, బావమరిది ఆంజనేయులు(ఆటో డ్రైవర్) సహకరించారు. ఈ క్రమంలో ఈ నెల 13న ఉదయం మృతుడు రవి డ్యూటీ నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరాడు. గ్రామ సమీపంలోనే దారికి ఆటో అడ్డంగా ఉంచి రవిని రాడ్డుతో కొట్టి హత్య చేశారు. ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్లి అదేరోజు సాయంత్రం పీలేరు మండలం కంచంవారిపల్లి వద్ద రైల్వే ట్రాక్‌పై పడేశారు. మృతుని ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేశారు. రైల్వే సిబ్బంది సమాచారంతో కేసు నమోదు చేసిన రైల్వే ఇన్స్‌పెక్టర్ నాగరాజ హత్యగా తేలడంతో కేసును కలికిరి పోలీసులకు బదిలీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పది రోజుల్లో ఛేదించి నిందితులు ఆనంద్, ఆంజనేయులుతో పాటు వీరికి సహకరించిన ఆనంద్ భార్యను గురువారం అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన రెండు ఇనుప రాడ్డులు, ఆటోను సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

గృహ, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్



సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు, ఎస్ఈ కృష్ణారెడ్డి

మదనపల్లె : ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. గురువారం ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డితో కలిసి పట్టణంలోని ఈస్ట్ సెక్షన్‌లోని సబ్‌స్టేషన్, డివిజనల్ కార్యాలయంలోని సబ్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం డిపాజిట్లు చెల్లించిన రైతులకు నెలన్నర రోజుల్లో కనెక్షన్లు ఇస్తామన్నారు. మదనపల్లె డివిజన్‌లో 1,082 మంది రైతులు కనెక్షన్లకు డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా 9గంటల పాటు సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్, గృహాలకు సంబంధించిన లైన్లను వేరుచేసి త్రీఫేజ్‌లో విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతునేస్తం మొబైల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 139 మంది రైతులు ఈ యాప్ ద్వారా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యుత్ సమస్యలపై ప్రజలు ఫోన్‌చేసేందుకు వీలుగా 1912 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. మదనపల్లె డివిజన్‌లో ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలు వీధి దీపాల విద్యుత్ వినియోగానికి సంబంధించి రూ.198 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కలిగిన రైతులు నెలకు రూ.30 కస్టమర్ చార్జీలు చెల్లించాలన్నారు. రామారావుకాలనీలో మూడు విద్యుత్ లైన్లు ఇళ్లపై వెళుతుండటంతో, ఇప్పటివరకు విద్యుత్‌షాక్‌తో 8 మంది మృతిచెందారని, చాలాకాలంగా ప్రజలు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని డైరెక్టర్ సుబ్బరాజు, ఎస్ఈ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకురాగా, వాటిని మార్చేందుకు సంస్థకు రూ.250 కోట్లు ఖర్చు వస్తుందని, ఈ విషయమై సీఎం కార్యాలయానికి ఉన్నతాధికారుల ద్వారా నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో ఈఈ యుగంధర్, ఈస్ట్ ఏఈ రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై మంత్రి ఆదిమూలపు సురేష్



మంత్రికి స్వాగతం పలుకుతున్న అధికారులు

బి.కొత్తకోట : జిల్లా పర్యటనలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం రాత్రి బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ చేరుకున్నారు. ఆయనకు తహసీల్దార్ రఫీక్ అహ్మద్, మదనపల్లె కమిషనర్ ప్రమీల, సీఐ శివాంజనేయులు, ఎస్ఐ రామమోహన్, వీఆర్‌ఓ నరేంద్ర స్వాగతం పలికారు. అధికారులు ఆయనకు గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాటు చేశారు.

ఎందుకమ్మా.. ఇలా చేశావ్!

అంగళ్లులో రాయచోటికి చెందిన మహిళ ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన నాగమణి

కురబలకోట : రాయచోటికి చెందిన నాగమణి (33) అనే వివాహిత మండలంలోని అంగళ్లులో సోదరుని ఇంటికి వచ్చి గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు..అంగళ్లుకు చెందిన నాగమణికి రాయచోటికి చెందిన రాజశేఖర్‌తో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. హైస్కూల్‌లో చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. బతుకు దెరువు కోసం భర్త ఏడు నెలల క్రితం కువైట్ వెళ్లాడు. ఈమె గురువారం మండలంలోని అంగళ్లులో ఉన్న సోదరుడు మహేష్ ఇంటికి నోముల పండగకు వచ్చింది. ఇతని భార్య మదనపల్లెలోని గుడికి వెళ్లింది. మహేష్ అంగళ్లులోని షాపునకు వెళ్లాడు. అతని పిల్లలు బడికి వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందింది. ఈమెకు అత్తింటిలో గాని పుట్టింటిలో గాని చెప్పుకోతగ్గ సమస్యలు లేవని ఇరు కుటుంబాల వారు చెబుతున్నారు. ఎందుకిలా చేసిందో అర్థం కావడం లేదని వాపోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లాస్థాయి స్క్వయ్ మార్షల్ ఆర్ట్స్‌కు ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె సిటీ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్క్వయ్ మార్షల్ ఆర్ట్స్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14,-17,-19 ఎంపికలు గురువారం మదనపల్లెలో జరిగాయి. ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి సుమారు వందమందికిపైగా పాల్గొన్నారు. వీరిలో 18 మంది మొదటి స్థానం పొందారు. వీరు డిసెంబర్ 11, 12 తేదీల్లో పాడేరులో జరగబోయే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు వసంత, సురేష్‌బాబు, బాబు, కరాటే ఇస్మాయిల్, స్క్వయ్ సెక్రటరీ ఫహీంబాషా, నరసింహులు పాల్గొన్నారు.

జనంపైకి దూసుకొచ్చిన బైక్

బి.కొత్తకోట : దారివెంట నడుచుకొంటూ వెళ్తున్న వారిపైకి ఓ బైక్ అతి వేగంతో దూసుకొచ్చిన ఘటన గురువారం జరిగింది. స్థానిక బీరంగిరోడ్డు పక్కన నాయనబావి గ్రామం తరిగోడుకు చెందిన కృష్ణారెడ్డి (50), స్థానికులైన కొందరు నడుచుకొంటూ వెళ్తున్నారు. అదే సమయంలో ఓ యువకుడు బైక్‌పై మితిమీరిన వేగంతో వస్తూ నడుచుకొంటూ వెళ్తున్న వీరిపై దూసుకొచ్చాడు. వీరు అప్రమత్తం కావడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఓ వ్యక్తికి భుజంపై స్వల్ప గాయమైంది. కృష్ణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది బాధితున్ని ఆసుపత్రికి తరలించారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

జగనన్న ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది



జగనన్న ప్రభుత్వంలో మాకు ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం స్లాబ్ దశలో ఇంటి పనులు జరుగుతున్నాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

- ఉప్పుతోల్ల సుమలత, కొత్తపల్లె, చౌటపల్లి గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం.

పాఠశాలల రూపురేఖలు మారాయి



నాడు– నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. మా పాఠశాలలో మొదటి విడత నిధులతో పాఠశాల విద్యుద్దీకరణ, భవనాల మేజర్, మైనర్ మరమ్మతులు, ఆర్‌ఓ ప్లాంటు, హ్యాండ్‌వాష్, గ్రీన్‌చాక్‌బోర్డులు ఏర్పాటు చేసుకున్నాము. రెండవ విడత మంజూరైన నిధులతో బాలికలకు టాయిలెట్లు, వంటగది, తాగునీటికోసం బోరు డ్రిల్లింగ్, పైపులైన్ ఏర్పాటుతో పాటు 4 తరగతి గదుల నిర్మాణం పూర్తయింది. పాఠశాలల ముఖచిత్రాల్లో మార్పు, వసతుల కల్పనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో హుషారుగా బడికి వస్తున్నారు.

- జాబీర్,ఉపాధ్యాయుడు, రాయచోటి

సొంత గూడు నిర్మించుకున్నాం



జగనన్న ప్రభుత్వం తోడ్పాటుతో సొంతగూడును నిర్మించుకోగలిగాము. ఎన్నో ఏళ్లుగా పక్కాగృహాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. జగనన్న ప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హతే ఆధారంగా జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. చాలా సంతోషంగా ఉంది.

- ఎం.సరస్వతి, లబ్ధిదారురాలు, రాయచోటి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గురువారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి టి.భరత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ మీడియా సంస్థలలో పనిచేస్తూ అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ కింద ఇంటి స్థలాలను అందించేందుకు ప్రభుత్వం జీఓ నంబరు. 535 ద్వారా వీలు కల్పించిందన్నారు. అర్హులైన జర్నలిస్టులు ఇళ్ల స్థలాల మంజూరు కోసం తమ వివరాలను హెచ్‌టీటీపీ://ఐపీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 6వ తేదీ లోపు వెబ్ సైట్‌లో జర్నలిస్టులు సంబంధిత వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. అక్రిడిటేటెడ్ జర్నలిస్టులకు కేటాయిస్తున్న ఇళ్ల స్థలం విలువలో 60శాతం ప్రభుత్వం, 40శాతం జర్నలిస్టులు చెల్లించాలని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాత జర్నలిస్టు అక్రిడిటేషన్ వివరాలను జర్నలిస్టుగా వారి వృత్తి అనుభవాన్ని ప్రాథమికంగా పరిశీలించి అర్హులైన జర్నలిస్టుల జాబితాను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లకు అందజేస్తారన్నారు. అనంతరం జిల్లా కమిటీలు నిబంధనల మేరకు జర్నలిస్టుల అర్హతను పరిశీలించి ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు సరైన స్థలాలను జిల్లా పరిధిలోనే గుర్తిస్తారన్నారు.

ముగ్గురు అదృశ్యం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో మదనపల్లె పట్టణంలో ముగ్గురు అదృశ్యం కాగా వన్,టు టౌన్ పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. వివరాలు ఇలా.. పట్టణంలోని దిగువ కురవంకకు చెందిన నాగరాజు, ఆదెమ్మల కుమార్తె జి.గాయిత్రి (19) పట్టణంలో సీటీఎం రోడ్డులోని బాంబే బిగ్‌బజార్‌లో పని చేస్తుండేది. అక్టోబర్ 31న ఇంటి నుంచి షాప్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు 20 రోజులుగా చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకి తెలియకపోవడంతో ఈనెల 22న తల్లి ఆదెమ్మ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే విధంగా పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన చేనేత కార్మికుడు సూరి భార్య జి.శిరీష ఈనెల 20వతేదీన ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త సూరి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి ఆచూకి తెలియకపోవడంతో టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే పట్టణంలోని సాయిరాంవీధికి చెందిన ఓ మైనర్ బాలిక (15) స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బాలిక తల్లి ఉపాధి కోసం కువైట్ వెళ్లగా అవ్వా,తాతల వద్ద ఉంటోంది. ఈనెల 21న స్కూల్‌కు వెళుతున్నట్లు చెప్పి తిరిగి రాలేదు. దీంతో అవ్వ టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కీచక టీచర్

- పదోతరగతి విద్యార్థినితో అసభ్యప్రవర్తన
- హెచ్ఎంకు ఫిర్యాదు చేసిందని, ఇంటిపై దాడిచేస్తానని బెదిరింపు
- ఉద్యోగం పోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ బ్లాక్‌మెయిల్
- గతంలో పలుచోట్ల ఇదే ప్రవర్తనతో సస్పెన్షన్



గోపీనాథ్

మదనపల్లె : విద్యా బుద్ధులు నేర్పి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వారధిగా నిలవాల్సిన ఉపాధ్యాయుడు వారితో అసభ్యంగా ప్రవర్తించి కీచకుడిగా మారిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గోపీనాథ్ పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఘటనకు సంబంధించిన వివరాలు... జెడ్పీ పాఠశాలలో ఈనెల 8వ తేదీన జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు అందరూ కార్యక్రమానికి హాజరవగా, బాధిత విద్యార్థిని ఆరోగ్యం బాగోలేక తరగతి గదిలో ఒంటరిగా చదువుకుంటోంది. దీన్ని గమనించిన పీడీ గోపీనాథ్ తరగతి గదిలోకి వెళ్లి అందరూ మీటింగ్‌లో ఉంటే నీవు ఏంచేస్తున్నావంటూ బాలిక వద్దకు వెళ్లి చనువుగా మాట్లాడుతూ, దగ్గరకు తీసుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని... ఈ విషయాన్ని తమ పెద్దలకు చెప్పింది. వారు పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు. పీడీపై చర్యలు తీసుకునేంతవరకు తాను పాఠశాలకు రాలేనని, వేరే పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం కల్పించాల్సిందిగా విద్యార్థిని కోరింది. దీనిపై పీడీ గోపీనాథ్‌ను హెడ్మాస్టర్ వివరణ కోరితే... విద్యార్థిని కుటుంబ సభ్యులతో తాను మాట్లాడుకుంటానని, ఇది తనకు కొత్తేమీ కాదని చెప్పాడు. వారి ఇంటికి వెళ్లి పాఠశాలలో జరిగిన విషయం బయటకు తెలిసి, తన ఉద్యోగం పోతే... మీ ఇంటిపై బాంబువేసి దాడిచేయడమే కాకుండా తాను, తన భార్య, కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుని దానికి మీరే కారకులని లేఖ రాస్తానంటూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. విద్యార్థిని తాత రిటైర్డ్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేసి ఉండటం, తన మనవరాలికి జరిగిన అన్యాయం మరే విద్యార్థినికి జరగకూడదనే సదుద్దేశంతో కీచక పీడీపై ఫిర్యాదుకు ముందుకు వచ్చారు. హెచ్ఎం సుబ్బారెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదును డీఈఓకు పంపారు. ఆయన ఆదేశాల మేరకు ఈ ఘటనపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాలిక కుటుంబ సభ్యులను ఎలాగైనా రాజీకి రావాలని పీడీతో పాటు అతడి కుటుంబ సభ్యులు బలవంతపెట్టారు. అయినప్పటికీ వారు ససేమిరా అనడంతో చివరకు చేసేదేమీలేక, తన తప్పును ఒప్పుకుంటూ.. నైతిక బాధ్యత వహిస్తూ..పాఠశాల విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంటున్నానని, తన ఉద్యోగ బాధ్యతలను మరో స్కూల్‌కు బదలాయించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహిస్తానని హామీపత్రం రాసిచ్చాడు. భవిష్యత్తులో ఈ సంఘటనపై, వ్యక్తిగత, ఇతర కారణాలతో తాను కానీ తన కుటుంబ సభ్యులు కానీ ఆత్మహత్యా ప్రయత్నం చేస్తే దానికి విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులకు సంబంధం లేదంటూ అందులో పేర్కొన్నాడు. ఈమేరకు హెచ్ఎం సుబ్బారెడ్డి ఉపాధ్యాయుడి లేఖను డీఈఓకు పంపనున్నట్లు తెలిపారు.

వెలుగు చూస్తున్న పీడీ లీలలు

పీడీ గోపీనాథ్‌కు బాలికలను వేధించడం పరిపాటిగా మారింది. కలకడ మండలం నడిమిచెర్లలో విద్యార్థినితో ఇలాగే అసభ్యంగా ప్రవర్తించడంతో సస్పెండ్ అయ్యాడు. తర్వాత కొన్నాళ్లకు విధుల్లో చేరి మళ్లీ మరోసారి అక్కడే ఓ అమ్మాయిని వేధింపులకు గురిచేసి, తననే వివాహం చేసుకున్నాడు. అక్కడి నుంచి జెడ్పీ పాఠశాలకు వచ్చిన పీడీ గోపీనాథ్ మూడేళ్ల క్రితం పదోతరగతి విద్యార్థినిని తీసుకుని హార్సిలీహిల్స్‌కు వెళుతుండగా, పోలీసులు పట్టుకుని హెచ్ఎంకు సమాచారం అందించారు. అలాగే ఘటన జరిగిన తర్వాత కూడా ఐదురోజుల క్రితం పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు పుస్తకాలు తరగతిగదిలో పెట్టి హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. దీని వెనుక గోపీనాథ్ ఉన్నాడని సహ విద్యార్థినులు చెప్పుకొచ్చారు. గోపీనాథ్ కీచకప్రవర్తనపై విచారణ జరుగుతోందని తెలుసుకున్న విద్యార్థినులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి అతడు తమతో ప్రవర్తించిన తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు.